


పి. సరళాదేవి

అప్పుడే లేచి బద్ధకంగా వళ్లు విరుచుకుంది పద్మావతి. పుట్టింట్లో కోడికూతతో మేలు కొంటున్న పద్మావతి, ఇక్కడ వీధితలుపు మోతతో మేలుకొంది. ఆ వీధితలుపు మోతయినా ఎవరింటిదా అని కొంచెంసేపు పస్తాయించింది అనుమానం తీరగానే లేచి, చీర సర్దుకుని తలుపు తీసింది కాఫీ గతప్రాణి పద్మావతికి సగంప్రాణం లేచొచ్చి మళ్ళీ వెంటనే కింద పడిపోయింది — నిన్న తనతో పాలుపోస్తానని చెప్పిన మనిషి కాదే, అనుకోడంతో

“ముందుండి పోయినోళ్ళకి నేనే పాలు పోస్తూండే దాన్నమ్మా! రాత్రి ఈ దారంట పోతూ ఈ ఇంట్లో ఎవరో మసలడం చూచి పాలుతెచ్చాను” అందా పాల మనిషి.

“మంచిదే కాని, నిన్ననే ఒకావిడవచ్చి పాలు తెస్తానని చెప్పి వెళ్ళింది. నువ్వింకెక్కడయినా చూసుకో”

“ఎవరమ్మా పోస్తానంది?”

“ఎవరో, తెల్లగా, సన్నగా, పొట్టిగా....”

“గంగా, దాంతో సెప్పేయండమ్మా తేవొద్దని. ఈ ఇంట్లో వున్నోళ్ళందరికీ నేనే పోస్తున్నాను ఇప్పుడు మీరు కాదంటారేటి?” అంటూ పాలు కొలవబోతూండేటప్పటికి ఇంతో అంతో వున్న నిద్రమత్తంతా ఒదిలిపోయింది- పద్మావతికి.

“ఆగు ఆగు కొలవక. నువ్వే ఇంకెక్కడయినా చూసుకో. ఆమెకు మాటిచ్చాం తరువాత బావుండదు, ఇంకా కావాలంటే నీకు కబురు పెడతాలే” అంది మంచిమాటలతో ఒదుల్చుకుందామని.

“కాదమ్మా! ఇవి ఆవుపాలు. ఇప్పుడే పితికి తెస్తున్నాను ఒక్కచుక్కన్నా నీళ్ళున్నాయేమో సూడు అది మూడొంతులు నీళ్ళే కలిపి తెస్తుంది పాలపిండికూడా కలుపుతూంటూందట.” ఇప్పుడు నిజంగానే కోపంవచ్చింది పద్మావతికి చచ్చినా ఆమెదగ్గిర తీసుకోకూడదనుకుంది.

“ఆమె నీళ్ళపాలే పోస్తూంటే, అప్పుడు నీదగ్గిర తీసుకుంటాలే” అంది చిరాగ్గా

“ఇది ఏమ్మా! నేను నెలకోసారే డబ్బుచ్చుకుంటాను ఆ మాలచ్చిమి ఎక్కడుందో గాని శేరుపాలు తీసుకుండేది. గుర్తొచ్చినప్పుడు డబ్బిచ్చేది నే నడిగేదాన్ని కాదమ్మా! ఇంత మంచిపాలు అక్కడ దొరుకుతాయో లేదో— అంటూనే ఎల్లిందమ్మా! ఒకపాలి ఏటయిందంటే....” నిద్రలేస్తూనే గోడకున్న అద్దంలో తనమొగం చూసుకోలేదుగదా అనుకుంది పద్మావతి. ఇంకా మత్తువదలని తలలో ఈమెనొదుల్చుకునే ఆలోచనే రావడంలేదు.

“అదంతా సరేగాని, కావాలంటే కబురు పంపిస్తాను. ఇప్పటికి వెళ్లు నాకింకా చాల పని వుంది” అంది చాల సౌమ్యంగానే.

కథానిక

“అలాగే అంటారమ్మా! ఆ తల్లి ఎల్లిపోయి మాకిపాట్లు. పండుగలకి ఉన్న పాలన్నీ తీసుకునేది. ఈ రవిక కూడా ఆ యమ్మే ఇచ్చింది”

అని గొణుక్కుంటూ, ఎలాగయితేనేం వెళ్ళి పోయింది. వీపుమీదున్న సిమ్మెంటుమూట దిగినట్టయింది పద్మావతికి.

అలా పెరట్లోకి వెళ్ళేసరికి చెల్లాచెదరుగా వున్న గిన్నెలు చెంబులు కన్పించాయి. పని మనిషి ఇంకా కుదరలేదు. చేసుకోక విధిలేదు. మొగం కడుక్కోడం, గిన్నెలు తోముకోడం, పొయ్యంటించడం అన్నీ ఒకటొకటిగా పూర్తి చేస్తూ వచ్చింది

ఆ ఇంట్లోనే ముందున్న వాళ్ళకి చేసేపనిమని షికి మధ్యాహ్నం కబురుపెట్టింది. ఆమె వచ్చిన తరువాత పనిచేస్తావా? అని అడిగితే....

''నేను చెయ్యలేనమ్మా! ఆ యమ్మ ఏదో బతిమలాడి 'లక్షమ్మా! ఒక్కదాన్ని. పెద్దదిక్కు లేదు. నువ్వుకూడా అలాగంటే ఎలాగ? నీ లాంటోళ్లు మళ్ళీ మాకు దొరుకుతారా?' అంటే చేసేదాన్ని.''

''అయితే చెయ్యవన్న మాట'' అంది పద్మ. ఈ ప్రవాహానికి ఆనకట్ట లేక పోయినా, మలుపైనా తిప్పిద్దామనే తలంపుతో.

''అదే చెబుతున్నాగదమ్మా .... శనివారం వచ్చిందంటే నేనే తల రుద్ది నీళ్లు పోసేదాన్ని. మిగిలిన కుంకుడుకాయలిచ్చి నన్ను కూడా పోసుకోమనేది నిజం చెప్పాలి. నా కష్టం వుంచుకోలేదు. చిరుగు పట్టిందంటే చీర ఇచ్చే సేది. రవికెలు ఇచ్చేది తెల్లవారి వస్తే రాత్రికే నేనింటికి చేరేదాన్ని-అలా ఇంట్లో మనిషిలా వుండేదాన్ని. కాఫీ ఫలహారం, భోజనం అంతా ఇక్కడే వట్టి సత్తెకాలపు మనిషి....'' అలా చెప్పకుంటూ వెళ్లిపోతోంది ఆ వచ్చిన మనిషి.

పద్మకి ఏంచేయాలో తోచక, చేసిన తప్ప ఒప్పకుంటున్నట్టు అంతా వింది చెప్పవలసిందంతా చెప్పేసి, పనిచేయనని చెప్పి వెళ్ళింది ఆ మనిషి. ''బ్రతికించావులేవమ్మా!'' అనుకుంది పద్మ వేరే ఒకామె ఎవరో వచ్చి చేస్తానంటే కుదుర్చుకుంది

ఆ మర్నాడు పెరుగు మనిషి ఎవరూ కుదర లేదే అని ఆలోచిస్తూంటే - ఒకావిడ గబగబా ఇంటో జొరబడింది.

''ముందున్నవాళ్లకి నేనే తెచ్చేదాన్ని. సూడు. గడ్డలాటి పెరుగు. మజ్జిగ గిజ్జిగ కలిపేదాన్ని కాదమ్మోయ్! ఆ యమ్మ నెయ్యి నా దగ్గిర తప్ప ఇంకెక్కడ కొందు. పూసల పూసల నెయ్యంటే ఆ యమ్మకి ప్రాణం'' నువ్వూ మొదలెట్టావూ అనుకుంది పద్మావతి.

''సరే, రోజూ వచ్చి మాకు పోస్తూండు. ఏదీ నెయ్యంటే ఇలా తే'' అని ఆ మాటల కడ్డువేసి నెయ్యి తీసుకుంది.

* * *

వచ్చిన రెండు మూడు రోజుల తరువాత ఆ వీధిలో వాళ్లు ఒకరూ ఒకరూ రావడం మొదలెట్టారు వచ్చినవాళ్లు వచ్చినట్టుండక వీళ్ళు రాకముందు ఆ ఇంట్లో ఉన్న ఆమె గురించి చెబుతూ గడిపేవారు ఇదంతా వింటూన్న పద్మావతి అయోమయంలో పడి పోయేది

అప్పుడే పంట పూర్తిచేసి వచ్చి, శనక్కాయలు వలుచుకు తింటోంది పద్మావతి. పక్క ఇంటి పిన్నిగారు వచ్చింది. ఏ వూరు, తల్లి తండ్రీ వున్నారా? మొదలైన మామూలు భోగట్టాలన్నీ అయిన తరువాత—

''ముందున్నావిడకి తల్లి లేదటమ్మా! నన్ను 'అమ్మా అమ్మా' అని పిలిచేది. ఎప్పుడూ మా ఇంటికొచ్చి కూర్చునేది 'మా అమ్మా వాళ్ళింటికి వెళ్తాను' అనేది అతనితో అతను కూడా మా మంచి మనిషి 'కన్నకూతురు కన్నా ఎక్కువై పోయిందేమండీ' అనేవాడు''

ఎంత ఇష్టంలేని సంభాషణ అయినా, బొత్తిగా ఏమీ మాట్లాడకుండావుంటే బావుండదని, ''మీకెంతమంది పిల్లలండి?'' అంది పద్మావతి

''ఉన్నారమ్మా! ముగ్గురు కూతుళ్ళూ, ఇద్దరు కొడుకులు మా పెద్దమ్మాయిని ఒక్క క్షణం వదిలేదికాదు ఎప్పుడూ 'అక్కా, అక్కా' అని తిరిగేది. అది అత్తారింటికి పోతూంటే ఏడ్చింది కూడాను''

''ఆవిడ పేరు ఏం పేరండీ?'' అంది విధి లేక.

"విశాలాక్షి. అతను 'విశాలా' అని పిలిచే వాడు చూస్తే ముచ్చటేస్తుంది. మూడు నంవత్సరాలున్నారా-ఒక్కరోజు వాళ్ళిద్దరూ పోట్లాడుకుంటే ఒట్టు." ఏమిచెబుతున్నదీ తెలియకుండా గుడుగుడుమని మాట్లాడేస్తోంది పిన్నిగారు.

"మనం కొన్ని కొన్ని పనులు ఇష్టం లేకుండానే చేస్తుంటాం" అని ఒకసారి అక్కయ్య చెబుతోంటే వింది పద్మావతి. ఆ ఇష్టం లేకుండా చేసే పనులేమిటో, ఎలా వుంటాయో స్పష్టంగా ఇప్పుడు తెలుసుకుంది.

"ఇంకా వంట పూర్తవలేదు. వెళ్తాను. ఒంటరిగా వుంటావు కాబోలు. పిల్లలొస్తే పంపిస్తానులే" అంది పిన్నిగారు లేచివెళ్తూ. ఇష్టం లేకుండా చేసేపని ఇంత త్వరగా పూర్తవడం సంతోషించవలసిన విషయమే అనుకుంటూ, 'హమ్మయ్య' అనుకోబోతోంది .... ఇంతలోనే 'అక్కా అక్కా' అని అరుస్తూ ఒక అమ్మాయి, ఇద్దరబ్బాయిలూ పరుగెత్తుకొచ్చారు ఎవరో తెలీదు

"ఏం పాపా?" అంది అందులో పెద్దపిల్లనుద్దేశించి

"అమ్మ మీ ఇంటికి వెళ్ళి ఆడుకోమంది" పరికిణీతో ముక్కు తుడుచుకుంటో చెప్పింది.

"మీ ఇల్లు ఎక్కడ పాపా?" ముగ్గుర్నీ చుట్టూ కూర్చోపెట్టుకుని అడిగింది

"తెలీదూ? .... అక్కడ .... అక్కడుండే పచ్చ ఇల్లు" పాపచెప్పే పద్ధతి చూసి నవ్వింది పద్మావతి. శనక్కాయలు వలిచి ముగ్గురికీ ఇచ్చింది చిన్నవాడు మాత్రం చేతులోవి విసిరేసి "నాకు బిస్కత్తులు కావాలీ...." అని అల్లరి మొదలుపెట్టాడు.

"ఆ అక్కేం-ఇంత సీసాతో నిండా బిస్కత్తులు వుంచేది. మేము వచ్చినప్పుడంతా ఇచ్చేది" అని పాప చెబుతోంటే విని, ఇంకో దారిలేక ఆ పాపచేతే అణా బిస్కత్తులు తెప్పించి ఇచ్చింది.

"అక్కా, నన్ను తిప్పవూ? ఆ అక్క నన్ను గిర్రుమని తిప్పేసేది. తిప్పవూ?" అంటూ బుజాలు ఎగరవేసుకుంటూ వచ్చాడు పెద్ద బ్బాయి. రెండు బుజాలూ పట్టుకుని గిర్రుమని తిప్పాలని అంటున్నాడని - అర్థం చేసుకుంటూంది తప్పటడుగులు వేసుకుంటూ చిన్నబ్బాయి వచ్చి—

"అక్కా! తార్ ఎత్తు....నన్ను ఎత్తు." అంటున్నాడు. 'సార్ ఎత్తి ఎగరవేసినట్టు ఎగరవేయి' అని అంటున్నట్టుగా పాప చెప్పే వరకూ తెలుసుకోలేక పోయింది పద్మావతి, ఓహో విశాల భర్తనన్నమాట ఈ 'సార్' అనుకుంది.

ఇలా పసిపిల్లలు కూడా ఆమెను గురించి చెబుతూండేసరికి పద్మావతి గాబరాపడి పోయింది. ఆమె నిజంగా ఎంత మంచిది కాకపోతే పసిపిల్లలు కూడా తలచుకుంటూంటారు, ఇంతమంది ప్రేమ సంపాదించడమంటే మాటలా?

సాయంత్రం అలా మొగం కడుక్కుని వీధి గుమ్మంలోకి వెళ్ళేసరికి, ఎదురింటావిడ పిలిచింది—"ఒక్కరూ ఉన్నారుకాబోలు, రండి" అంటూ. పిలిచిన తరువాత బావుండదని తలుపు తాళంవేసి వెళ్ళింది.

ఏవేవో పొడిప్రశ్నలు అయిన తరువాత "ఆ విశాలాక్షి అతను అలా వెళ్ళగానే, ఇలా తాళంవేసుకుని వచ్చేసేది. 'ఏవిటోనండీ ఒక్కర్తినీ ఏమీ తోచదు' అనేది. కళ్లు చిన్నవే అయినా మనిషి వుండేదీ....చిదిమితే పాలు కారతాయి" అంది ఇంటావిడ

"అవునక్కా! విశాలక్కతో ప్రతి సినిమాకి వెళ్ళేదాన్ని. నన్ను తీసుకువెళ్ళకుండా వెళ్ళనే వెళ్లదు. వెళ్లి వుత్తరాలు వ్రాస్తానని చెప్పింది, కాని వ్రాయనేలేదు" అంది పదమూడేళ్లయినా వెళ్లివెళ్లని ఇంటావిడ కూతురు.

"ఆవిడకి ఎంతమంది పిల్లలండీ?" అంది పద్మావతి ఇటువంటి సంభాషణకు ఎప్పుడో అలవాటు పడిపోయిన మనిషిలా

"ఇక్కడికి వచ్చిన తరువాతే కవలపిల్లలు-పిల్ల, పిల్లవాడు పుట్టారు. తల్లిలేక ఇక్కడే పురుడు పోసుకుంది. సగం నా చేతులమీదే జరిగింది. ప్రతివిషయం నన్నే అడిగేది, ఎలా చేయాలి ఏమి చేయాలని. సరదా అయిన

మనిషితే'' అని అడిగిందే చాలన్నట్లు సంతో షంతో చెబుతోంది ఇంటావిడ.

ఎవర్ని అనాలో, ఏమనాలో తెలియడంలేదు పద్మావతికి ఏ విధంగానూ తెలియని, కలియని మనిషి తన జీవితంలో చొచ్చుకుపోతోంది. అందరూ ఆదేపనిగా చెప్పడంతో తనకూ ఉత్సాహం కలుగుతోంది, ఆమెను గురించి తెలుసుకోవడంలో కాని 'మంచి' తప్పితే ఇంకోవిషయం చెప్పలేక పోతున్నారు ఎంత బాగా పనిచేసింది ఆమె ప్రభావం!

ఉన్నట్టుండి ఓరోజు పెరుగు మనిషి చెప్పింది, ''నాకు పెళ్ళీడు కూతురుందమ్మా! ఆ యమ్మున్నప్పుడు ఓసారి తీసుకొచ్చాను పాతచీర, రవిక ఇచ్చి గాజులేయించుకోమని పావలాడబ్బులు ఇచ్చింది మాతల్లి'' ఈ ఉపో ద్ఘాత మెందుకో పద్మావతికి చూచాయగా తెలి సింది. అయినా మాటాడక వూరుకుంది

అప్పటికి వూరుకున్నా, మర్నాడు విరిగిన పాలుతెచ్చి, ''విరిగినపాలు కావాలేటి? ఆ యమ్మ తీసుకుంటూ వుండేది, అందుకని అడిగాను'' అంది.పద్మావతి అక్కర్లేదని చెప్పగానే, ''పోనీ పావలాడబ్బు లియ్యండమ్మా! పిల్లదానికి గాజు లేయిస్తాను. పండుగొస్తోంది'' అంది 'బయట పడ్డావా?' అనుకుని, పావలాతీసి ఇచ్చింది పద్మావతి.

* * *

ఇవన్నీ చూస్తూంటే ఎప్పుడో చదివిన ఓ కథ—మొదటి భార్య చనిపోగా వచ్చిన రెండో భార్య, ఆ మొదటి భార్య జ్ఞాపకాలనించి భర్తని, నౌకర్లని, స్నేహితులను, బంధువులను తప్పించడానికి పడిన కష్టం, బాధ, అప్పటి ఆమె మానసిక స్థితి- అన్నీ జ్ఞాపకం వచ్చాయి పద్మావతికి.

ఎంత ప్రయత్నించినా విశాలాక్షి సంభాషణనించి ఎవర్నీ తప్పించలేకపోతోంది ఎంత మరీ ఓర్పుగల మనిషైనా ఎన్నిమార్లు వినగలదు, ఎంతసేపు వినగలదు? తను ఇన్నాళ్లూ మార్పులూ, చేర్పులూలేని పల్లెలో వ్యవసాయం చేసుకుంటూన్న తండ్రిదగ్గిరవుండి ఏమీ తెలుసుకోలేకపోవడం నిజమే! మొదటిసారిగా ఇక్కడికే కాపురానికి రావడమూ నిజమే. అయితే బొత్తిగా అంత తెలియదా? మనిషే కాదా? ఆమెనంత పొగిడి తనను....ఏమీ అనలేదు!

ఇంతకీ ఈ చెప్పేవాళ్ళ వుద్దేశం ఏమై వుంటుంది? ఆమెలాగ మంచిగా, బిస్కత్తులు ఇస్తూ, సినిమాలకు తీసుకువెళ్తూ.... ఫక్తు ఆమెలా తనూ తయారవ్వాలనా? లేకపోతే....

ఏమీ నిర్ణయించుకోలేక అంతకంతకూ కంగారులో పడిపోతోంది పద్మావతి. ఇటువంటి స్థితిలోవున్న పద్మావతికి పొద్దుటినుంచి జరిగినవన్నీ జ్ఞాపకంవచ్చి ఏడుపొచ్చినంత పనైంది.

ప్రొద్దున్నే ఒకావిడవచ్చి ఏదో మాట్లాడింది ''ఆ విశాలాక్షి కాఫీతాగనిదే నన్ను వెళ్లనిచ్చేది కాదమ్మా! మనిషంటే ప్రాణం పెడుతుంది. అప్పటికప్పుడు చేసిచ్చేది. ఇంట్లో ఏదైనా శుభకార్యం చేసుకుంటున్నామూ అంటే వట్టి చేతులతో పంపనే పంపదు'' అని మొదలు పెట్టింది, ఇంకా చెప్పవలసింది ఎంతోవున్నట్టు. అలా ఒక్కనిముషం తీవ్రంగా ఆమె మొగంలోకి చూసి, 'ప్చ్' అని తనకు మాత్రం వినిపించేట్టు మూలిగింది పద్మావతి.

ఈవిడ వదిలిందీ అనుకునేసరికి, మూడిళ్ళవతలవాళ్లమ్మాయివచ్చి 'విశాలక్క'ను కొంచెం సేపు తలచుకుని, గరిటతో చక్కెర పట్టుకు వెళ్ళింది.

మధ్యాహ్నం భోజనంచేసి చేయి తుడుచుకుంటూంది, ఇంకో అమ్మాయి తమ్ముణ్నెత్తుకొచ్చింది. 'విశాలక్క' గురించి చెప్పడానికి అమ్మాయీ, వినడానికి పద్మావతి సిద్ధంగానే వున్నారు.

''మాకు పనేదన్నా వుందీ అంటే వీడిని 'అక్క'కు అప్పగించేసే వాళ్లం. మేము మళ్లా వచ్చేవరకూ ఆడించేది'' అని చెప్పి, 'పోరా!' అక్కరా! మంచివాడివి కదూ! మనక్కే. పోమ్మా! బంగారు! బిస్కత్తులిస్తుంది'' అని తమ్ముడ్ని ముందుకి నెట్టుతోంది.

''రా బాబూ!'' అని పద్మావతి చేతులు చాస్తుంటే వాడు వెనక్కు వెనక్కు జరుగుతున్నాడు.

''వీడికన్నా పెద్ద తమ్ముళ్లు ఇద్దరున్నా రక్కా! వాళ్ళ పేర్లు గోపి, శేషు.'అక్క' మాత్రం రెండూ కలిపేసి ఒకడ్ని 'గోపిశేషా' అని, ఇంకోడ్ని 'శేషగోపీ' అని పిలిచేది. వీళ్ళేం తక్కువ తిన్నారా? 'అక్కసార్' అని పిలిచేవారు. మా చెల్లిని 'పెంకిపిల్లా' అని పిలిచేది అక్క....''

''బెంగుళూరు, మైసూరు, జార్జెట్, షిఫాన్ చీరలు, క్రేపు జాకెట్లు-చూస్తారేమమ్మా!'' అని ఈ అమ్మాయి మాటలు వినిపించనీయకుండా వీధిలోంచి కేక వినిపించింది.

''ఒద్దొద్దు'' తిరిగి కేకవేసింది పద్మావతి.

''చూడండమ్మా!''

''ఒద్దు''

''కొనొద్దుగాని చూడండమ్మా ఆ 'అమ్మ' ఎప్పుడూ పిలుస్తూండేది.''

''ఒద్దంటూంటే'' - ఇదెక్కడి సంతరా బాబూ అనుకుంటూ ఒళ్ళుమండి గట్టిగా అనేసింది.

తరువాత ఈ అమ్మాయి మళ్ళీ అంది.

''ఆ 'అక్క' వీధిలోకి వచ్చినవల్లా కొంటూనే వుంటుంది ఎన్నెన్నిచీరలు, జాకెట్లు. బలే ఖర్చుపెడుతుంది'' అమ్మ పిలుస్తూంటే తమ్ముడ్ని ఎత్తుకుని ఈ అమ్మాయి వెళ్లగానే గాజులు బుజాన్నేసుకుని ఒకడు రానే వచ్చాడు. పోనీ, రానేవచ్చాడు కదా, తీసుకుందాం అని పద్మావతి గాజులు చూస్తోంది.

''ఏమ్మా! ఈ ఇంట్లో తెల్లగా ఒకమ్మ వుండేది....'' అని అడుగుతున్నాడు గాజులవాడు అనుమానంగా

''వాళ్ళని ఇంకోవూరు మార్చేశారు గాని, ప్లెయిన్ ఎరుపు ...అబ్బ లావుగా వున్నాయి.... సన్నగా, నైస్‌గా వుండాలి''

''ఇవే తీసుకోండమ్మా! ఆ 'అమ్మ' వచ్చినప్పుడంతా ఇవే కొనేది''

''ఇవొద్దు. సన్నవి ఇయ్యి.''

''నామాట వినండమ్మా! ఇవే తీసుకోండి. ఆ 'అమ్మ'....''

పద్మావతికి ముక్కులోంచి పొగలు వచ్చాయి. క్షణంసేపు వాడి కళ్ళల్లోకి అలా చూసి, "నాకేం వద్దుగాని, తీసుకుపో'' అని చేతిలోని గాజులన్నీ అక్కడే పడేసి, లేచి దూరంగా వచ్చేసింది ఆ చూపుల ప్రభావ మెంతటిదో కాని, వాడు మళ్ళీ కిక్కురుమనకుండా అన్నీ కట్టేసి, గబగబా వెళ్ళిపోయాడు

ఆ రోజు సంతరోజు అనే విషయం జ్ఞాపకం వచ్చింది రిబ్బన్లవాడు, అల్యూమినియమ్ గిన్నెలవాడు, పిన్నులు సూదులవాడు, వగైరా వగైరా వాళ్ళంతా వచ్చి ఆ 'అమ్మ' గురించే మాట్లాడతారేమోనని భయపడిపోయి తలుపులు బిడాయించుకొని కూర్చుంది పద్మావతి

ఆ రోజు ఇంక పూర్తికాదేమో అనుకుంది. ఈ పరిస్థితి అంతాచూసి బెంబేలెత్తి పోయింది విశాలాక్షిమీద అంత మోజుగా వున్న ఈ 'ప్రపంచం'లో ఎందుకొచ్చి పడ్డానా అనే విచారంతో, ఆ రాత్రి అన్నం దిగలేదు పద్మావతికి.

అనుకోకుండా ఎదురింటి పక్కింటివాళ్ళు ట్రాన్సఫర్ అయి వెళ్ళిపోయారు నిజానికి వాళ్ళ పిల్లల్ని అందరూ'రాక్షసులు' అనేవాళ్ళు. పిల్లలూ పిల్లలూ దెబ్బలాడుకుని పెద్దవాళ్ళ వరకూ వెళ్ళడం, దాంతో పెద్దవాళ్ళూ పెద్దవాళ్లూ దెబ్బలాడుకోవడం, ఇలా రోజూ ఏదో ఒక గొడవ జరుగుతూనే వుండేది. నలుగురు కూడితే ఆవిడగురించి, ఆ పిల్లలుగురించే చెప్పకునేవారు.

వాళ్ళు వెళ్ళిపోయారంటే 'శని విరగడైంది లేమ్మా!' అని సంతోషంగా చెబుతారనుకుంది పద్మావతి ''పిల్లలు అలుకుడుగా వుండేవారు; ఇల్లు చిన్నబోయింది. ఆవిడపిల్లలు తలపుకు వస్తోనే వున్నారు'' వంటివి కొందరు చెబుతోంటే విని ఆశ్చర్యపోయింది. అయితే వాళ్ళు నిజంగా అంటున్నారో, పైపైగా అంటున్నారో, ఏ వుద్దేశంతో అంటున్నారో, తెలుసుకోలేక పోయింది. ఉన్నన్నాళ్ళూ తిట్టుకుని కొట్టుకున్నవాళ్ళు వెళ్ళిపోయిన తరువాత అభిమాన పాత్రులయారంటే ఏవిటనుకోవాలి?

వీళ్ళమీద ఏ అభిప్రాయమూ ఏర్పరచుకోక ముందే పద్మావతి భర్తకు ట్రాన్సఫర్ అర్డ

(తరువాయి 27-వ పేజీలో)